

# టిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు...

**సిరిసిల్ల టౌన్ ఆగస్టు 16 ప్రజాజ్యోతి న్యూస్:**

సిరిసిల్ల నియోజకవర్గం లోని ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామం ఎల్లారెడ్డిపేట మండలాలలోని దుమాల గ్రామాలకు చెందిన వారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరగా సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మిగతా 2 లో




సోమవారం17 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:09

# వీధుల్లో మైకుల హోరు

- వ్యాపార ప్రచారం మాటున శబ్ద కాలుష్యం
- తెల్లవారుజామున 5,6 గంటలకే మైకుల మోత
- నిద్రకు భంగం,విద్యార్థుల చదువుకు ఆటంకం
- నగరవాసుల నరకయాతన
- పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్







**కరీంనగర్ క్రైం, ఆగస్టు 16, (ప్రజాజ్యోతి):**

తెల్లవారుజామున ప్రశాంతంగా ఉండాల్సిన వేళ మైకుల మోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొబ్బరి కుడుకలకు చక్కెర, నూకలు, బియ్యం కొనుగోలు చేస్తామంటూ,అలాగే పాత ఇనుప సామాన్లు కొంటాం,తల వెంట్రుకలకు గిన్నెలు తదితరాలను కొనుగోలు చేస్తామంటూ కొందరు వ్యాపారులు వాహనాలకు పెద్ద పెద్ద మైకులు ఏర్పాటు చేసి వీధుల్లో తిరుగుతున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటలకే మైకుల ద్వారా పెద్ద శబ్దంతో ప్రచారం ప్రారంభిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగతా 2 లో

# విధుల నిర్లక్ష్యంపై అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అంగన్వాడీ సేవల అమలులో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు
- సూపర్వైజర్ నివేదిక ఆధారంగా చర్యలు



**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 16 ప్రజా జ్యోతి;**

ఓదెల-II అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్గా పనిచేస్తున్న జె. ప్రమీలను విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో లోపాలు, ప్రభుత్వ సేవల అమలులో నిర్లక్ష్యం తదితర ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు ఇంచార్జ్ మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి కోయ శ్రీహర్ష తెలిపారు.అంగన్వాడీ టీచర్గా పనిచేస్తున్న జె. ప్రమీల విధుల నిర్వహణకు సంబంధించి పలు ఆరోపణలు పేర్కొన్నట్లు కలెక్టర్ తెలిపారు. మిగతా 2 లో



# ముస్తాబాద్ ఎస్ఐ జ్యోతికి ఉత్తమ సేవా పురస్కారం

**ముస్తాబాద్, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా: ముస్తాబాద్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రత కోసం నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ముస్తాబాద్ ఎస్ఐ జ్యోతి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎస్ఐ జ్యోతి అందించిన సేవలను గుర్తిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పత్రాన్ని అందుకోవడం పట్ల ముస్తాబాద్ మండల ప్రజలు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. మిగతా 2 లో

# వీధుల్లో మైకుల హోరు

మొదటిపేజీ తరువాయి

తెల్లవారుజామునే మైకుల హోరుతో ఇళ్లలో నిద్రిస్తున్న చిన్నారులు,వృద్ధులు,అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా పాఠశాలలు,కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చదువుకోవాల్సిన సమయంలోనూ ఈ శబ్దాలు ఇబ్బందికరంగా మారుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

### వాడవాడలా మైకుల హోరు...

నగరంలోని పలు కాలనీలు,ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో ఉదయం పూట మైకులు ఏర్పాటు చేసిన వాహనాలు తిరుగుతూ కనిపిస్తున్నాయి. “కొబ్బరి కుడుకలు కొనుగోలు చేస్తాం... చక్కెర ఇష్టం.. నూకలు, బియ్యం కొనుగోలు చేస్తాం... పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తాం...తల వెంట్రుకలకు గిన్నెలు” అంటూ పదేపదే మైకుల్లో ప్రకటనలు చేస్తుండటంతో ప్రశాంత వాతావరణం పూర్తిగా దెబ్బతింటోందని ప్రజలు అంటున్నారు.

వ్యాపారులు తమ వస్తువులు లేదా సేవలకు ప్రచారం చేసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని అయితే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమయపాలన పాటించాలని నగరవాసులు కోరుతున్నారు.ముఖ్యంగా తెల్లవారుజామున 5, 6 గంటల ప్రాంతంలో మైకులు వినియోగించకుండా కొంత ఆలస్యంగా ప్రారంభిస్తే తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

### నిద్రకు భంగం.. విద్యార్థులకు ఆటంకం...

ఉదయం వేళ మైకుల నుంచి వెలువడుతున్న భారీ శబ్దాల కారణంగా నిద్రలేచిపోతున్నామని పలువురు ప్రజలు చెబుతున్నారు.రాత్రి ఆలస్యంగా విధులు ముగించుకుని ఇంటికి చేరుకునే ఉద్యోగులు,షిఫ్ట్‌లలో పనిచేసే కార్మికులు కూడా తెల్లవారుజామున వచ్చే మైకుల శబ్దాలతో నిద్రకు దూరమవుతున్నారని వాపోతున్నారు.విద్యార్థుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పరీక్షలు సమీపిస్తున్న సమయంలో తెల్లవారుజామున చదువుకునే విద్యార్థులకు మైకుల శబ్దం తీవ్ర ఆటంకంగా మారుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.ఏకాగ్రతతో చదవాల్సిన సమయంలో పదేపదే వినిపించే ప్రకటనలతో విద్యార్థులు విసుగు చెందుతున్నారని చెబుతున్నారు.

### వృద్ధులు, చిన్నారులకు మరింత ఇబ్బంది...

పెద్ద శబ్దాలు చిన్నారులు,వృద్ధులు,ప్రశాంతత అవసరమైన వ్యక్తులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. తెల్లవారుజామున ప్రశాంతంగా ఉండాల్సిన సమయంలో అకస్మాత్తుగా మైకుల శబ్దాలు వినిపించడంతో భయాందోళనకు గురవుతున్న చిన్నారులు కూడా ఉన్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

### సమయపాలన పాటించాలి...

వ్యాపారులకు ప్రచారం చేసుకునే హక్కు ఉన్నప్పటికీ, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా మైకుల వినియోగంలో సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందని నగరవాసులు సూచిస్తున్నారు.కనీసం ఉదయం 10 గంటల తర్వాత మైకులు వినియోగిస్తే ప్రజలకు పెద్దగా ఇబ్బంది ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.వ్యాపారం చేసుకోవడాన్ని మేము అడ్డుకోవడం లేదు.కానీ తెల్లవారుజామునే మైకులు పెట్టి వీధుల్లో తిరగడం వల్ల నిద్ర భంగం కలుగుతోంది. పిల్లలు చదువుకోలేకపోతున్నారు.వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కొంత ఆలస్యంగా ప్రచారం ప్రారంభిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు” అని స్థానికులు పేర్కొంటున్నారు.

### పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్...

నగరంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు పోలీసులు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.తెల్లవారుజామున అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా పెద్ద శబ్దంతో మైకులు వినియోగించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రధానంగా ఉదయం 5 నుంచి 10గంటల మధ్య మైకుల వినియోగంపై అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పెద్ద శబ్దంతో ప్రచారం నిర్వహిస్తున్న వాహనాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ప్రజల ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలి

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు. వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా, అదే సమయంలో ప్రజల నిద్ర, విద్యార్థుల చదువులు,వృద్ధుల ఆరోగ్యం దెబ్బతినకుండా సమయపాలనతో మైకులు వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.తెల్లవారుజామున మైకుల మోతకు అడ్డుకట్ట వేసి నగరవాసులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# టిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు...

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితక్క ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని, ఉద్యమకారుల, సింగరేణి కార్మికుల, ఆటో కార్మికుల, నిరుద్యోగుల పక్షాన, నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ఉద్యమాలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. కవితక్క ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావడం జరుగుతుందన్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలు, యువకులు, ప్రజలు పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2029లో తెలంగాణకు కల్వకుంట్ల కవితక్కను ముఖ్యమంత్రి చేయడమే మన అందరి లక్ష్యం అన్నారు. కవితక్క ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్ళి, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలన్నారు. సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయాలని మజీద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు. ముస్తాబాద్ మండల నాయకులు మార్వాడి దేవరాజు, కదిరే రేణుక, మల్లవ్వ లు పాల్గొన్నారు.



# ముస్తాబాద్ ఎస్ఐ జ్యోతికి ఉత్తమ సేవా పురస్కారం

మొదటిపేజీ తరువాయి

ప్రజల సమస్యలపై స్పందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ జ్యోతికి పలువురు అభినందనలు తెలిపారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం ముస్తాబాద్ పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు.

# విధుల నిర్లక్ష్యంపై అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి

ఆరోపణల తీవ్రత, లబ్ధిదారుల ప్రయోజనాలు, అంగన్వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వ సేవలు నిరంతరాయంగా కొనసాగాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, విషయం పూర్తిగా పరిశీలించబడే వరకు జె. ప్రమీలను అంగన్వాడీ సేవల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.సస్పెన్షన్ కాలంలో ఓదెల-×× అంగన్వాడీ కేంద్రం సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత సూపర్వైజర్ అందుబాటులో ఉన్న అంగన్వాడీ టీచర్‌కు కేంద్రం పూర్తి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. సీడీపీవో, సంబంధిత సూపర్వైజర్ ఉత్తర్వులను తక్షణమే అమలు చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, గుడ్లు, ఇతర సంక్షేమ సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అంగన్వాడీ సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.4.10 లక్షల ఆర్థిక సాయం అందజేత

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 16 (ప్రజాజ్యోతి )**



అనారోగ్యంతో మృతి చెందిన కరీంనగర్ జిల్లాకు చెందిన ఫోటోగ్రాఫర్ మహిమల సంధ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.4,10,000 కుటుంబ భరోసా ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కుటుంబ భరోసా చెక్కును రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవి, కరీంనగర్వరంగల్ ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి భూపతి సూరిబాబు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించడం పట్ల పలువురు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ ప్రెసిడెంట్ కొప్పుల కనకారావు, నైస్ రఫీ, నాగిశెట్టి రమేష్, సౌత్ ఇండియా అసోసియేషన్కు చెందిన రాజేశ్వర్ రెడ్డి, బొంగోని మధు, మియాపురం రాజు, లక్ష్మణ్ శంకరాచారి, మాటూరి రంజిత్ తదితర ఫోటో, వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

---

# నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి



**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**..మండల ప్రజలు తమ దరఖాస్తులను మండల స్థాయిలోనే అందజేయాలి**

**..ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదు**

**పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు-16 ప్రజా జ్యోతి:**

ఆగస్టు 17వ తేదీ నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఇతర దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నందున, తమ సమస్యలు, వినతులు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

---



# బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన ఆలయ కమిటీ

**తిమ్మాపూర్,ఆగస్టు 16(ప్రజాజ్యోతి)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మ నగర్ లో వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ తాపాలలక్ష్మీ నరసింహ స్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుండి ప్రారంభమవుతాయని బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.ఆదివారం రోజున దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి పాలకమండలి సభ్యులతో కలిసి దేవాలయ వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.26న బుధవారం రోజున నిత్యపూర్ణాహుతి అనంతరం మధ్యాహ్నం12 15 ని లకు అభిజిత్ లగ్నంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం సామూహిక అష్టాదశ ఆరాధన కార్యక్రమం 28 శుక్రవారం రోజున ఉదయం 9 గంటలకు శేషాహోమము మహాపూర్ణాహుతి బలిహారణం చక్రతీర్థం ఆరగింపు రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం ధ్వజారోహణము సప్త వర్ణములు ఉద్వాసనబలి గ్రామబలి ఆరగింపు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,ఆలయ కమిటి, అర్చకులు కోరారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి,పెండ్యాల కొండల్ రెడ్డి,గూడ కమలాకర్,గాదే వెంకటపతి,గొంటుకు కనకయ్య,కేతిరెడ్డి నారాయణ రెడ్డి దొనపాటి రాజిరెడ్డి,ఎం రాజేందర్,కొండ్ర రాజు,బొమ్మరవేని బాలకృష్ణ,కన్నం సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---

# ఇల్లందకుంటలో నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం

**ఇల్లందకుంట ఆగస్టు 16(ప్రజాజ్యోతి):**

ఇల్లందకుంట మండల కేంద్రంలో ధార శివరంజనిసదానందం రాజరాజేశ్వర ఎనర్జీ హబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్, డీజిల్ పంపును హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు, వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని పెట్రోల్ బంక్ యాజమాన్యాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ డీఎస్పీ రాం నరసింహారెడ్డి, ఇల్లందకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కుమార్, దేవాలయ చైర్మన్ రామారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ కొంరెల్లి, మండల అధ్యక్షురాలు రజిత, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కోనరావుపేట లో అటల్ బీహార్ వాజ్ పేయ్ వర్ధంతి వేడుకలు

**కొనరావుపేట, ఆగస్టు.16(ప్రజాజ్యోతి)**

కొనరావుపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ, ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్ పేయి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. నాయకుడిగా, కవిగా, పార్ల మెంటేరియన్ గా భారతదేశానికి వాజ్ పేయ్ అందించిన సేవలను స్మరించుకున్నారు. సుపరిపాలన దేశాభివృద్ధి ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో. అజ్మీర తండా సర్పంచ్ అజ్మీర జయరాం, మండల ఉపాధ్యక్షులు చింతల పరశురాములు, చీకటి మధు, బూత్ అధ్యక్షులు ధూర్ల శంకర్, చౌటపల్లి వెంకన్న ,పిల్లి వెంకటేష్, దుండిగల బాలరాజు, శ్రీనివాస్ ,వినోద్, విజయ్, మల్లయ్య, భాను, సంజీవరెడ్డి, పరశురామ్ ,కళ్యాణ్, దేవేందర్, శ్రీహరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పారమిత హెరిటేజ్ విద్యార్థుల ఉచిత ఆరోగ్య శిబిరం

**కరీంనగర్ టౌన్,ఆగస్టు 16 (ప్రజాజ్యోతి )**

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల సైన్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. నర్సింగ్ ఆఫీసర్ పర్యవేక్షణలో విద్యార్థులు వాకర్స్, క్రీడాకారులకు బీపీ, షుగర్,బి ఎం ఐ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామంపై అవగాహన కల్పించారు.పాఠశాలలో పొందిన జ్ఞానాన్ని సమాజ సేవకు వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్ రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# డ్రోన్ జిల్లా యూనియన్‌కు నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్షుడిగా అగ్గి శ్రవణ్.. రైతులకు డ్రోన్ టెక్నాలజీని చేరువ చేస్తాం

## - ఎకరాకు రూ.400కే పంట మందుల పిచికారీ: యూనియన్ తీర్మానం

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 16 ప్రజా జ్యోతి;**

డ్రోన్ జిల్లా యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అగ్గి శ్రవణ్ బాధ్యతలు స్వీకరించారు. రైతులు, డ్రోన్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారంతో పాటు ఆధునిక డ్రోన్ టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది. స్థానికంగా యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అగ్గి శ్రవణ్, ఉపాధ్యక్షుడిగా సబ్బని సందీప్, క్యాషియర్‌గా చుంచు ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు.కో-ఆర్డినేటర్లుగా చుంచు పెద్దిరాజ్, శ్రవణ్ కుమార్, అగోలాపు వేణు, పొన్నం హరీష్, గట్టు ప్రశాంత్, దికొండ కమురయ్య, మల్లెతుల సంతోష్, మారేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధ్యక్షుడు అగ్గి శ్రవణ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రోన్ల ద్వారా పంటలకు మందులు పిచికారీ చేయడంతో పాటు పంటల పరిస్థితిని సులభంగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. దీనివల్ల సమయం, కూలీల ఖర్చు తగ్గడంతో పాటు పంటల సంరక్షణ మెరుగుపడి దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఎకరాకు రూ.400 చొప్పున పంట మందుల పిచికారీ చేయాలని యూనియన్ సమావేశంలో తీర్మానించినట్లు అగ్గి శ్రవణ్ తెలిపారు. ఇకపై యూనియన్ సభ్యులు ఈ నిర్ణయించిన ధరలకే డ్రోన్ పిచికారీ సేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంతో పాటు రోడ్లు, ఇతర మౌలిక వసతుల పర్యవేక్షణలోనూ డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక అవకాశాలపై మరింత అవగాహన కల్పిస్తామని చెప్పారు.డ్రోన్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ నిరంతరం కృషి చేస్తుందని అగ్గి శ్రవణ్ హామీ ఇచ్చారు. సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని నూతన కమిటీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో డ్రోన్ జిల్లా యూనియన్ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి. ప్రభుత్వ విప్పు మాజీ జెడ్పిటిసిల చిత్రపటాలకు పాలాభిషేకం

**కాల్వ శ్రీరాంపూర్ ఆగస్టు 16 ప్రజా జ్యోతి**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. లక్ష్మీపురం గ్రామ సర్పంచి లావణ్య జనార్దన్ రెడ్డి  ఆధ్వర్యంలో. ఆదివారం రోజున. ఓదెల మల్లికార్జున దేవస్థానం నుండి .అబిడిపల్లె. రాయపేట.పందిళ్ళ గ్రామం వరకు. ఆ నుండి నాంసానిపల్లె. లక్ష్మీపురం వరకు బీటి రోడ్డు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ప్రభుత్వ విప్పు చింతకుంట విజయ రమణారావు .మాజీ జెడ్పిటిసి గోపగోని సారయ్య గౌడ్ ల. చిత్రపటాలకు .పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణ సదయ్య. లతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు. ఉపసర్పంచులు. మాజీ ఎంపీటీసీ లు మాజీ సర్పంచులు .కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎండిపోతున్న చెట్లు.పొంచి ఉన్న ప్రమాదం

**కాల్వ శ్రీరాంపూర్ ఆగస్టు 16(ప్రజా జ్యోతి)**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం నుండి గంగారం గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా పెట్టిన చెట్లు ఏపిగా పెరగగా. కొన్ని చెట్లు ఎండిపోయి వర్షాకాలం వస్తే గాలి వానలకు రోడ్డుపై విరిగిపడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల గురికావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే గాలి వానలకు ఎవరిపై చెట్లు పడతాయోనని వాహనదారులు . ఈ దారిలో వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం వస్తే చెట్లు రోడ్డుపై విరిగిపడి వాహనాల రాకపోకల కు ప్రతి యేట అంతరాయం కలుగుతుంది .ఆ చెట్టు విరిగిపడడం స్థానిక ప్రజాప్రతినిధులు తొలగించడం ఆనవాయితీగా మారింది. చెట్లు ఏపుగా పెరగడమే కాకుండా కొన్ని చెట్లు ఎండిపోయాయి. ఎండిపోయిన చెట్లు ఎప్పుడు ఇరిగిపడతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు చర్య తీసుకొని చెట్లను తొలగించి వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని ఆయా గ్రామాల ప్రజలు. వాహనదారులు. ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# అనారోగ్య బాధితులకి అండ ... అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళి గౌడ్..

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 16(ప్రజా జ్యోతి)**



ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ఎండి సమీర్ పక్షవాతం కారణంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణకు భారంగా మారిన విషయం తెలుసుకుని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల మురళి గౌడ్ తన మిత్రులు మంగోలి శ్రీనివాస్ గౌడ్ విషయాలు దృష్టికి తీసుకురాగా తక్షణమే తన వంతు బాధ్యతగా 50 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు ఆదివారం రోజు అందించారు. ఈ కార్యక్రమంలో మంగోల్ శ్రీనివాస్ గౌడ్ ,జి శ్రీనివాస్ గౌడ్, ముత్యాల ప్రమీలా బాలరాజు ,మాజీ ఎంపీటీసీ సభ్యుడు స సింగారపు మధు, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,దేవరాజ్ గౌడ్,  దేవరాజు,  కిషన్ ,ఘనగోని నాగరాజుగౌడ్ , రామచంద్రం ,షేక్ ఉస్మాన్ ,ఘనగోని బట్టి గౌడ్, నాగపురి నాగభూషణం గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు .ఇలాంటి సేవా అందించే చైర్మన్ ఆకుల మురళి గౌడ్ ను పలువురు అభినందించారు.



# ఇల్లంతకుంట లో అర్ ఎస్ ఎస్ యువసమ్మేళనం ముఖ్య అతిథిగా హాజరైన బౌదిక్ ప్రాముక్

**ఇల్లంతకుంట ఆగస్టు 16(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర కళ్యాణమండపంలో ఆదివారం రోజు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో యువ సమ్మేళన కార్యక్రమం నిర్వహించరూ ఈ సందర్భంగా యువ సమ్మేళన సమితి అధ్యక్షులు రేగుల కార్తీక్ మాట్లాడుతూ దేశం మనకేమిచ్చింది అని కాకుండా దేశానికి మనశీ ఏమీచ్చినామని ఆలోచించి దేశభక్తి, ధర్మ మార్గంలో నడవాలని యువతే భవిష్యత్ తరానికి పట్టుకొమ్మలని అందరిని కలుపుకొని దేశం కోసం హిందూ ఐక్యత తో ఆర్ఎస్ఎస్ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వక్తగా విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీ సామల కిరణ్ మాట్లాడుతూ స్వాతంత్రం ఉద్యమంలో అందరూ దేశం కోసం ప్రతిక్షణం ఆలోచిస్తూ తపనపడేవారని, పోరాటం, అందరి సమైక్య ఆలోచన, జీవితాలను సమర్పిస్తేనే మనకిప్పుడు స్వతంత్రం వచ్చిందని అందుకే వారిని 80 సంవత్సరాల నుంచి గుర్తు పెట్టుకుంటున్నామని మనం కూడా మన దేశం కోసం, సమాజం కోసం మంచిపని ధర్మ మార్గంలో చేస్తే చిరకాలం గుర్తుంటుంది అన్నారు దానితో మన బాధ్యత, గౌరవం, విలువలు అనేవి సమాజానికి ఒక దారి చూపిస్తాయని ఆర్ఎస్ఎస్ ని ప్రారంభించిన శ్రీ కేశవరావు బలిరాం పంత్ హెడ్గే వారు డాక్టరేట్ చేశారని, వారి తర్వాత వచ్చిన మాధవరావు సదాశివరావు అసిస్టెంట్ ప్రొఫెసర్ అని అన్నారు. ఆర్ఎస్ఎస్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నది అని డాక్టర్ జి రెండుసార్లు జైలుకు వెళ్లారని స్వాతంత్రం తరువాత దేశాన్ని మరియు హిందుత్వాన్ని ఐక్యం చేయడం కోసం ఆర్ఎస్ఎస్ ని ప్రారంభించి శతవసంతాలు పూర్తి అయిన సందర్భంగా ప్రతి ఒక్కరూ తమతమ గ్రామాలలో ఆర్ఎస్ఎస్ శాఖ నడిపించాలని అన్నారు. ఇప్పటి సమాజంలో యువత 60 శాతం పైగా ఉందని అలాంటి వారు ఎంత మంచి పని చేసిన ముందు తరాలకు గుర్తుంటుందని, సమాజంలో జరిగే తప్పులని నిలదీస్తూ ప్రశ్నించాలని మరియు మంచి పని విషయంలో ఉద్యమించాలని అన్నారు. యువత మత్తు, మాదకద్రవ్యాలు, మొబైల్ గేమ్స్, ఇంస్టాగ్రామ్ వంటి వాటికి బానిసత్వం కాకుండా వాటిని వదిలేసి సమాజం, వ్యక్తిత్వం, గౌరవం , శారీరక శ్రమ, దేశభక్తి, దైవభక్తి కోసం బ్రతకాలని, జీవిత లక్ష్యాలను చేరుకునే క్రమంలో కుటుంబ గౌరవ విలువలను బాధ్యతగా నిర్వహిస్తూ సమాజంలో పౌర విధులను కూడా ఆచరించాలి అని అన్నారు. ప్రపంచ దేశాల అన్నింటికంటే మన భారతదేశంలో యువశక్తి ఎక్కువగా ఉంది మనం ఏ ఆలోచన చేసిన ఆ యొక్క ప్రభావం దేశం, ప్రపంచం మీద పడుతుంది అందుకే మనం ఐక్యతతో ఉండి సమాజ హితం కోసం ధర్మ మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని అంజన్న, ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్ , సహ కార్యవాహ కాసుపాక కిషన్, బౌద్ధిక్ ప్రముఖ్ నాగసముద్రాల బాలకృష్ణ, శారీరక ప్రముఖ్ కాంకటి శ్రీకాంత్, ప్రచార ప్రముఖ్ చల్ల సాగర్ రెడ్డి, వి హెచ్ పి మండల అధ్యక్షులు ఏగుర్ల శ్రీనివాస్, సర్పంచ్ ఎం రాజు వార్డ్ మెంబర్స్ ర్యాకం సుమన్, ఎర్రోజు రవితేజ, బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్, అరుణ్, వినోద్ సంతోష్, అనిల్, నిఖిల్, చరణ్, రంజిత్ 100 మంది యువత, స్వయం సేవకులు పాల్గొన్నారు

# ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కలవేన రాజయ్య మృతి

## - మాజీ ఎమ్మెల్యే దాసరి పరామర్శ

**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 16 ప్రజా జ్యోతి:**

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కలవిన రాజయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.రాజయ్య మృతిచెందిన విషయం తెలుసుకున్న దాసరి మనోహర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, రాజయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.



# 11వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన మున్సిపల్ చైర్మన్,పుల్కం. రాజు

**వేములవాడ,ఆగస్టు,16:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలోని 11వ వార్డ్ లో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ వెంగల అనిత శ్రీకాంత్ తో కలిసి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు, పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే స్థానికంగా వర్షపు నీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు.



# ఉత్తమ సర్పంచి అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం.....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 17 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామ సర్పంచ్కి ఇల్లందుల గీతాంజలి ఉత్తమ గ్రామ సర్పంచ్ అవార్డు గ్రహీత సందర్భంగా బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుకూరు గోవర్ధన్ గౌడ్ ,ఎల్లారెడ్డిపేట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వర్ష కృష్ణారి ,మల్లారెడ్డి ,గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ,ఎలగందుల నరసింహులు ,జబ్బర్ ,ఆంజనేయులు గౌడ్, కిషన్ ,శ్రీనివాస్ యాదవ్ ,తదితరులు బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లేందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డిని చాలువాతో సన్మానించారు అభినందనలు తెలియజేశారు.



# తిమ్మాపూర్ లో యూరియా రచ్చ..... ఉదయం నుంచి పడి కాపులు ....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

తిమ్మాపూర్ కోఆపరేటివ్ కార్యాలయంలో యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు యాప్ ద్వారా బుక్ చేసుకున్న యూరియా రాకపోవడంతో కార్యాలయం రచ్చ రచ్చ చేసిన ముగ్గురు యువ రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు యువకులు ఉదయం నుంచి నాలుగు గంటల వరకు వేచి చూసి అసహనం వ్యక్తం చేస్తూ యాప్ ఇబ్బందుల కారణంగా బుక్ చేసుకున్న రైతులకు తీవ్ర అసహనంతో క్యాలిక్యులేటర్ ను ధ్వంసం చేసి ఫైలు చిందర వందనం చేశారు చివరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని యధావిధిగా యూరియాను పంచినట్టు రైతులు తెలిపారు.



# ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి


**చొప్పదండి ,ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):**



ఎస్సీ కార్పొరేషన్ రుణాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని బిజెపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బడ్జెట్లో ఎస్సీ కార్పొరేషన్కు నిధులు కేటాయించి నప్పటికీ ఇంతవరకు మంజూరు కాలేదని విమర్శించారు. దళితులపై వివక్ష చూపుతున్నారని, రాజీవ్ యువ వికాసం పేరుతో దరఖాస్తు చేసిన యువకులకు కూడా రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే రుణాలు మంజూరు చేయాలని, లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# చరిత్రకు సాక్ష్యం.. పర్యాటకానికి గమ్యస్థానం రామగిరి ఖిల్లా

**శ్రావణంలో భక్తులతో కళకళలాడుతున్న రామగిరి ఖిల్లా.. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాల సమ్మేళనం.. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు.. రోప్‌వే ఏర్పాటుతో కొత్త రూపు.. చరిత్రను సంరక్షిస్తూ.. ప్రకృతిని కాపాడుతూ.. భక్తిని గౌరవిస్తూ.. పర్యాటకానికి కొత్త గమ్యంగా రామగిరి ఖిల్లాను తీర్చిదిద్దితే, నాటి వైభవానికి నేటి అభివృద్ధి తోడై భవిష్యత్ తరాలకు ఇది ఒక అపూర్వ వారసత్వ సంపదగా నిలిచిపోనుంది.**





**రామగిరి, ఆగస్ట్ 16 (ప్రజాజ్యోతి) :**

ఒకవైపు శతాబ్దాల చరిత్రను మోస్తున్న రాతికట్టడాలు.. మరోవైపు పచ్చని ప్రకృతి అందాలు.. ఇంకోవైపు ఆధ్యాత్మిక విశ్వాసాలను ప్రతిబింబించే ఆలయాలు, విగ్రహాలు.. ఇలా చరిత్ర, సంస్కృతి, ప్రకృతి, భక్తి సమ్మేళనంగా నిలుస్తోంది రామగిరి ఖిల్లా. నాటి రాజుల పాలనకు, కాకతీయుల శిల్పకళా వైభవానికి ఆనవాళ్లుగా నిలిచిన ఈ దుర్గం నేటికీ చరిత్ర ప్రియులను, ప్రకృతి ప్రేమికులను, భక్తులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా వర్షాకాలంలో కొండంతా పచ్చదనంతో కళకళలాడుతుండటంతో శ్రావణ మాసంలో ఖిల్లాకు సందర్శకుల తాకిడి మరింత పెరుగుతోంది. ఇన్నాళ్లూ అభివృద్ధికి నోచుకోని ఈ చారిత్రక కట్టడానికి ప్రభుత్వం పర్యాటక హంగులు అద్దేందుకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రామగిరి ఖిల్లాకు కొత్త రూపు రానుంది. దీనికి తోడు రోప్‌వే ఏర్పాటుకు కేంద్రస్థాయిలో ఆమోదం లభించడంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యం :

పెద్దపల్లి జిల్లాలోని రామగిరి ప్రాంతంలో కొండపై విస్తరించి ఉన్న ఈ ఖిల్లా శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. రాతి గోడలు, బురుజులు, కోట నిర్మాణ అవశేషాలు, పురాతన విగ్రహాలు, ఫిరంగుల ఆనవాళ్లు నాటి పాలకుల వైభవాన్ని గుర్తు చేస్తున్నాయి. ఎత్తైన కొండపై నిర్మించబడిన ఈ దుర్గం సైనికపరంగా వ్యూహాత్మక ప్రాంతంగా ఉండేదని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. స్థానికంగా లభించిన





పురావస్తు ఆధారాలు ఈ ప్రాంతానికి ప్రాచీన చరిత్ర ఉన్న విషయాన్ని వెల్లడిస్తున్నాయి. శాతవాహనుల కాలం నుంచి ఈ ప్రాంతం వివిధ రాజవంశాల పాలనలో ఉన్నట్లు చరిత్ర పరిశోధకులు పేర్కొంటున్నారు. అనంతరం కాకతీయుల ఆధీనంలోకి వచ్చిన రామగిరి దుర్గం వారి పాలనలో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. కాకతీయుల పతనం అనంతరం ముసునూరి నాయకులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, మొఘలులు, అసఫ్‌జాహీల పాలనలోనూ ఈ ప్రాంతం కొనసాగింది. పెద్దపల్లి జిల్లా అధికారిక సమాచారం ప్రకారం కాకతీయ ప్రోలుడు రామగిరి ప్రాంతాన్ని కాకతీయుల ఆధీనంలోకి తీసుకురాగా, అనంతరం ముసునూరి కాపయనాయకుడి కాలంలో రామగిరి సబ్బినాడుకు ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగా ఎదిగింది. తదుపరి బహమనీ, కుతుబ్‌షాహీ, మొఘల్, నిజాం పాలనల ప్రభావం ఈ ప్రాంతంపై పడింది.

### కాకతీయుల శిల్పకళకు నిలువెత్తు నిదర్శనం :

కాకతీయుల కాలం అంటేనే శిల్పకళకు, నిర్మాణ వైభవానికి పెట్టింది పేరు. రామగిరి ఖిల్లాపై కనిపించే పురాతన రాతి నిర్మాణాలు, కోట గోడలు, బురుజులు, ఆలయ అవశేషాలు నాటి శిల్పుల నైపుణ్యాన్ని చాటుతున్నాయి. కాలగమనంలో అనేక నిర్మాణాలు శిథిలమైనప్పటికీ మిగిలిన ఆనవాళ్లు అప్పటి నిర్మాణ సాంకేతికతకు అద్దం పడుతున్నాయి. ఎత్తైన కొండను సహజ రక్షణ కవచంగా ఉపయోగించుకుని కోట నిర్మించిన తీరు నాటి పాలకుల సైనిక వ్యూహాన్ని తెలియజేస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలను దూరం నుంచే పరిశీలించే అవకాశం ఉండటంతో ఈ దుర్గానికి వ్యూహాత్మక ప్రాధాన్యత ఏర్పడింది.

### ఫిరంగులు.. నాటి యుద్ధ చరిత్రకు ఆనవాళ్లు :

రామగిరి ఖిల్లా సైనిక చరిత్రను గుర్తుచేసే ముఖ్యమైన అవశేషాల్లో ఫిరంగులు కూడా ఉన్నాయి. గతంలో కోట రక్షణ కోసం అనేక ఫిరంగులు, తోపులు ఏర్పాటు చేసి ఉండేవని స్థానిక చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో వాటిలో చాలా వరకు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం మిగిలిన ఫిరంగి నాటి యుద్ధ వాతావరణాన్ని గుర్తు చేస్తూ చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. కోటలోని రాతి గోడలు, బురుజులు, రక్షణ మార్గాలు పరిశీలిస్తే అప్పట్లో శత్రు దాడులను ఎదుర్కొనేందుకు ఎంత పటిష్టమైన ఏర్పాట్లు చేశారో అర్థమవుతుంది.

### పురాణాలతోనూ అనుబంధం :

రామగిరి ఖిల్లాకు చారిత్రక ప్రాధాన్యతతో పాటు పౌరాణిక విశిష్టత కూడా ఉంది. శ్రీరామచంద్రుడు వనవాస సమయంలో ఈ ప్రాంతానికి వచ్చి తపస్సు చేశాడని, ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని స్థానికుల విశ్వాసం. ఖిల్లాపై సీతాసమేత శ్రీరాముడు, ఆంజనేయస్వామి, నంది విగ్రహాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. శ్రీరాముడితో ముడిపడిన ఈ విశ్వాసాల కారణంగా రామగిరి ఖిల్లా చారిత్రక ప్రదేశంగానే కాకుండా ఆధ్యాత్మిక క్షేత్రంగానూ గుర్తింపు పొందింది. శ్రావణ మాసంలో ప్రత్యేకంగా భక్తుల రాక పెరుగుతుంది. ప్రతి శని, సోమవారాల్లో భక్తులు కొండపైకి చేరుకుని పూజలు, దర్శనాలు నిర్వహిస్తున్నారు.

### బేగం వాడ నుంచి బేగంపేట వరకు.. :

రామగిరి చరిత్ర కోట గోడలకే పరిమితం కాదు. చుట్టుపక్కల గ్రామాల పేర్లలోనూ నాటి సామాజిక, సాంస్కృతిక, వాణిజ్య జీవన ఆనవాళ్లు కనిపిస్తాయి. రత్నాలు విక్రయించే ప్రాంతం రత్నపూర్‌గా, బేగంలు నివసించిన ప్రాంతం బేగంపేటగా పేర్లు వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. పోతన పేరుతో పోతారం, ఆయన తల్లి లక్కమాంబ పేరుతో లక్కారం, నాగళ్లు నిలిపే ప్రాంతం నాగపల్లి, శుక్రవారం సంత జరిగే ప్రాంతం శుక్రవారంపేట, ఆదివారం సంత జరిగే ప్రాంతం ఆదివారంపేటగా పేర్లు ఏర్పడ్డాయని స్థానిక కథనాలు ఉన్నాయి. మైదాపిండి విసిరే రాళ్లు ఉండే ప్రాంతం మైదంబండగా, గుండరాజు పేరుతో గుండారం పేరు వచ్చిందని కూడా చెబుతారు. అదేవిధంగా రాజుల కాలంలో సంగీత, నృత్య కళాకారులు నివసించే ప్రాంతాన్ని 'భోగం వాడ'గా పిలిచేవారని, కాలక్రమంలో అదే 'భోగంపేట'గా మారిందని స్థానిక చరిత్ర చెబుతోంది. దీంతో రామగిరి ప్రాంతం అప్పట్లో సైనిక, పరిపాలనా కేంద్రంగానే కాకుండా కళలు, వాణిజ్యం, సామాజిక జీవనానికి కూడా కేంద్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### వనమూలికలకు నిలయంగా.. :

రామగిరి ఖిల్లాకు మరో ప్రత్యేకత ప్రకృతి సంపద. కొండ ప్రాంతంలో అనేక రకాల వృక్షాలు, ఔషధ మొక్కలు, వనమూలికలు కనిపిస్తాయి. స్థానికంగా 200కు పైగా రకాల వనమూలికలు ఉన్నట్లు చెబుతుండటంతో ఈ ప్రాంతం ఆయుర్వేద వైద్యులు, ప్రకృతి పరిశోధకులకు ఆసక్తికర ప్రదేశంగా మారింది. అయితే ఈ వనమూలికలపై శాస్త్రీయంగా సమగ్ర సర్వే నిర్వహించి, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పర్యాటక అభివృద్ధితో పాటు ప్రకృతి సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

### శ్రావణంలో ప్రకృతి సోయగం :

వర్షాకాలం ప్రారంభమైన వెంటనే రామగిరి ఖిల్లా రూపమే మారిపోతుంది. ఎండాకాలంలో రాతిబండలతో కనిపించే కొండ ప్రాంతం వర్షాలు పడగానే పచ్చదనంతో పరుచుకుంటుంది. కొండచరియల మధ్య నుంచి జాలువారే నీటి ధారలు, పచ్చని చెట్లు, చల్లటి గాలులు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఎత్తైన ప్రాంతం నుంచి చుట్టుపక్కల గ్రామాలు, పొలాలు, కొండల అందాలను వీక్షించడం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. ప్రకృతి అందాలకు తోడు చారిత్రక నిర్మాణాలు ఉండటంతో ఫొటోగ్రఫీ, ట్రెక్కింగ్, హెరిటేజ్ టూరిజానికి కూడా రామగిరి అనుకూలంగా మారుతోంది.

### పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు :

ఇన్నాళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న రామగిరి ఖిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఖిల్లాను సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది.

# వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

- బిజెపి మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ

**కొనరావుపేట, ఆగస్టు.16(ప్రజాజ్యోతి)**

వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ, డిమాండ్ చేశారు. కొనరావుపేట మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ గతంలో వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తామని అధికారులతో సర్వే చేయించరాని తెలిపారు. కానీ ఇంతవరకు నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అజ్మీర తండా సర్పంచ్ అజ్మీరా జయరాం, మండల ఉపాధ్యక్షులు చింతల పరుశరాములు, చీకటి మధు,బూత్ అధ్యక్షులు దూర్ల శంకర్, చౌటుపల్లి వెంకన్న, పిల్లి వెంకటేష్, దుండిగల బాలరాజ్, మల్లెబోయిన విజయ్ ,డాక్టర్ మల్లయ్య, మోత్కు భాను, కస్తూరి సంజీవరెడ్డి ,చక్రాల పరశురాములు, అజ్మీర, కళ్యాణ్ ,లౌడియా తిరుపతి లకావత్ శ్రీహరి ,లకావత్ దేవేందర్ ,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రక్తదానం చేసిన తాడూరి మహేష్

**వేములవాడ,ఆగస్టు,16:ప్రజాజ్యోతి.**


పలు సేవలు చేస్తూ సమాజ సంక్షేమానికి కృషి చేస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు అయిన పిఎంఆర్ బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్ మేనేజర్ తాడూరి మహేష్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చూపారు దుబాయిలో రక్త దానం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు వేములవాడ నివాసి అయిన తాడూరి మహేష్ దుబాయ్ లో ఉన్న పిఎంఆర్ బిల్డింగ్ మెటీరియల్ ట్రేడింగ్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తూ సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నారు పేదలకు అన్న వితరణ కార్యక్రమాలు, విరాళాలు, రక్తదానం వంటి ఎన్నో సేవే కార్యక్రమాలు సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తూ ఉన్నారు అంతేకాక సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ కు తన యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తూ ఉన్నారు. ఈ సందర్భంగా సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు, ట్రస్ట్ అధ్యక్షులు ఏద్దండి రాజు మాట్లాడుతూ... తాడూరి మహేష్ వారి సేవలు చాలా గొప్పవని వారు ఇటువంటి సేవలు ఇంకా కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు






# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి ఒకరికి తీవ్ర గాయాలు

**ముస్తాబాద్, ఆగస్టు 16( ప్రజా జ్యోతి ):**





ముస్తాబాద్: ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవునూర్ గ్రామ శివారులో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన సుల్తాని యాదిరెడ్డి (61) తన భార్య సుల్తాని అంజమ్మతో కలిసి మోటార్ సైకిల్‌పై మల్లారెడ్డిపేట నుంచి అవునూర్ గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో అవునూర్ గ్రామంలోని పెట్రోల్ పంప్ సమీపంలోకి చేరుకోగా, ఎదురుగా వస్తున్న టిప్పర్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుల్తాని యాదిరెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య సుల్తాని అంజమ్మకు పలు రక్తస్రావ గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి బంధువు సుల్తాని సతీష్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్ 230 గ్రాముల గంజాయి స్వాధీనం

**జమ్మికుంట, ఆగస్టు 16 (ప్రజాజ్యోతి) :**



జమ్మికుంట పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను జమ్మికుంట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 11,400 విలువైన 230 గ్రాముల గంజాయిని, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన నాగిరెడ్డి హరిప్రసాద్, దుర్గం కార్తిక్ అనే ఇద్దరు యువకులు గంజాయి అలవాటుకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ నెల 15న మహారాష్ట్రలోని నాగపూర్ వెళ్లి ఒక వ్యక్తి వద్ద 230 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి, రైలులో మందమర్రికి తెచ్చి ఆదివారం ఆ గంజాయిని విక్రయించేందుకు జమ్మికుంటలోని ఎఫ్‌సీఐ గోడౌన్ పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి, ఫోన్లు లభ్యమయ్యాయి. పట్టణంలో గాని పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయం కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణ గౌడ్ హెచ్చరించారు.

# మై వేములవాడ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

**వేములవాడ,ఆగస్టు,16:ప్రజాజ్యోతి.**

ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1954 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున స్థానిక టిటిడి ధర్మశాల భీమేశ్వర రాజన్న ఆలయం వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా దొంతుల కళ్యాణి గారి పుట్టినరోజు సందర్భంగా ముంబై వాస్త వ్యులు వీరి భర్త దొంతుల మనోహర్, కుటుంబ సభ్యులు కల్లూరి పేరమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమానికి కొడుకులు,కొడ ళ్ళు: కల్లూరి రమణయ్య సుబ్బ మ్మ దంపతులు, కల్లూరి. చెలు మయ్యా, కల్లూరి వెంకటాద్రి, వి జయమ్మ, కల్లూరి.శ్రీనివాసులు, సుబ్బరత్నమ్మ, కల్లూరి. చిన్నవెంకటయ్య, సునీత, కూతురు మ ద్దినేని.రత్నమ్మ, అన్నదానం చే శారు.పుట్టినరోజు పెళ్ళిరోజు, ఇతర త్ర కార్యక్రమాలకు పేదలకు ఒ క్క పూట అన్నదానం చేయల నుకునే దాతలు ట్రస్టు సభ్యుల ను,9246939388 నంబర్ కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహ కులు మధు మహేష్ కోరారు.





# జర్నలిస్టుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు....

## - ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్

**హుజురాబాద్, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి) :**

జర్నలిస్టుల రెండు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాలతో దక్కించుకున్న ఇళ్ల స్థలాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అక్రమ కుట్రలను సహించే ప్రసక్తే లేదని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గూడూరు స్వామిరెడ్డి పెట్టిన వివాదాస్పద కేసుపై రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆయనతో మాట్లాడి కేసును బేషరతుగా ఉపసంహరింపజేయాలని ఆయన అల్టిమేటం జారీ చేశారు.

టీయు డబ్ల్యూజే (ఐజేయూ) హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వేదికగా జర్నలిస్టులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షా శిబిరానికి టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన నగునూరి శేఖర్ దీక్షాపరులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి దాదాపు 20 ఏళ్లుగా అలుపెరగని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఎన్నో ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా ఇళ్ల స్థలాలను సాధించుకుంటే, స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కక్షపూరితంగా అడ్డుపడుతూ న్యాయపరమైన చిక్కులు సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. శ్రమజీవులైన మీడియా ప్రతినిధులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఇలాంటి వ్యక్తి వైఖరిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, బాధ్యతాయుతమైన మంత్రులు తక్షణమే రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం వహించి, ఈ అక్రమ కేసును ఎత్తివేయించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టుల ఆగ్రహ జ్వాలలు రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతాయని హెచ్చరించారు.

**అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర నిరసన... వార్తల బహిష్కరణ...**

ఇళ్ల స్థలాల వివాదంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని, సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామిని రవీందర్ లు ధ్వజమెత్తారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై కాంగ్రెస్ అధిష్ఠానం తన స్పష్టమైన వైఖరిని తేల్చి చెప్పే వరకు, ఇళ్ల స్థలాల సమస్య కొలిక్కి వచ్చేంతవరకు హుజురాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని రకాల వార్తలు, ప్రెస్ మీట్లు, అధికారిక కార్యక్రమాలను సంపూర్ణంగా బహిష్కరిస్తున్నట్లు వారు తీవ్ర స్వరంతో ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు కేదాసి శ్రీధర్, నిమ్మటూరి సాయికృష్ణ, సమ్మెట సతీష్, బొడ్డు శ్రీనివాస్, మచ్చిక చందు, టేకుల సాగర్, పోతరాజు సంపత్, బండి సాయికృష్ణ, నాగవెల్లి రాజు, బొడ్డు శ్రీనివాస్, భారత రజనీకాంత్ లు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ గౌడ్,మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సామాజికవేత్త సబ్బానీ వెంకట్,బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్,వెంకటేష్, దేవసాని ప్రియదర్శిని,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాడుగుల ఓదెలు, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. స్వామిరెడ్డి వైఖరి నశించాలి" అంటూ నినదిస్తూ అంబేద్కర్ చౌరస్తా పరిసరాలను హోరెత్తించారు. కళాకారుల ఆటపాట పలువురిని ఆకట్టుకున్నాయి.

# పెద్దమ్మ ఆలయంలో చోరీ

## - తాళాలు పగులగొట్టి అమ్మవారి ఆభరణాలు, హుండీలో నగదు అపహరణ

**రామగిరి, ఆగస్ట్ 16 (ప్రజాజ్యోతి) :**

రామగిరి మండలం బేగంపేట గ్రామ శివారులోని పెద్దమ్మ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయ తలుపులు, తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు అమ్మవారి ఆభరణాలతో పాటు హుండీలోని నగదును అపహరించుకెళ్లారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. రోజువారీగా ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లే మధునమ్మ శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకోగా తలుపులు, తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించింది. వెంటనే విషయాన్ని ఆలయ చైర్మన్ బొంతల రవికి సమాచారం అందించింది. దీంతో ఆలయ పూజారి, చైర్మన్ రవి కలిసి ఆలయానికి చేరుకుని లోపల పరిశీలించారు. అమ్మవారి ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మంథని సీఐ స్వామి, రామగిరి ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. దుండగులు అమ్మవారికి చెందిన రెండు పుస్తెలు, రెండు ముక్కుపుడకలు అపహరించినట్లు గుర్తించారు. అలాగే హుండీని తెరిచి అందులో ఉన్న సుమారు రూ.500 నగదును కూడా ఎత్తుకెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆలయం గ్రామ శివారులో ఉండటంతో రాత్రి సమయంలో దుండగులు చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆలయం పరిసర ప్రాంతాలు, ప్రవేశ మార్గాలను పరిశీలించిన పోలీసులు చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సమీప ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, గతంలో జరిగిన ఇలాంటి ఘటనలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆలయ చైర్మన్ బొంతల రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు..



# వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి శ్రీధర్ బాబు..

**ముత్తారం ఆగస్టు,16 (ప్రజా జ్యోతి)**



మండలంలోని జిల్లాలపల్లె గ్రామ సర్పంచ్ గడ్డం రాజేశం ముదిరాజ్ కుమారుడు గడ్డం సంతోష్ ముదిరాజ్ శ్రావ్య ల వివాహము ధర్మారం మహేశ్వర ఫంక్షన్ హాల్ లో ఆదివారం రోజు జరుగగా ఈ వివాహ కార్యక్రమానికి మండల నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఐటి పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల రాష్ట్రమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం ముదిరాజ్, ముత్తారం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బియ్యని శివకుమార్ ముదిరాజ్, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మానేరు వాగులో గల్లంతై కారు డ్రైవర్ మృతి

**సుల్తానాబాద్, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):**



నీరుకుల్ల మానేరు వాగులో గల్లంతైన సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కారు డ్రైవర్ జహంగీర్ (43) మృతదేహం ఆదివారం లభ్యమైంది. కుటుంబ సభ్యులతో కలిసి పిక్నిక్‌కు వెళ్లిన జహంగీర్ మానేరు వాగులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న నీరుకుల్ల సర్పంచ్ కాంపల్లి సతీష్ చొరవ తీసుకుని గజ ఈతగాళ్లు కుమార్, శివల సహాయంతో గాలింపు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత జహంగీర్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం బంధువులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు జహంగీర్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన జహంగీర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మైనార్టీ నాయకులు సలీం, గోరే, పుచ్చు, నదీమ్, కలీం సర్వర్, హైదర్, రఫిక్ తదితరులు కోరారు.

# నేడు మండల స్థాయిలో ప్రజావాణి,

## - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - ఎంపీడీఓ కృపాకర్,



**ఎండపల్లి ఆగస్టు 16, ప్రజా జ్యోతి,**

మండల స్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు, ప్రతి సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎండపల్లి ఎంపీడీఓ కృపాకర్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు.ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు అందజేయాలని , సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను పరిశీలించి,ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని మొదటగా ఈ వేదిక గుల్లకోట గ్రామంలో రైతు వేదికలో నిర్వహించాలని అనుకున్న, అనివార్య కారణాలవల్ల చివరికి ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనే నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు విషయాన్ని గమనించి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృపాకర్ ఒక ప్రకటనలో కోరారు.

# ఉత్తమ అవార్డు అందుకున్న కార్యదర్శి తాళ్ల కిరణ్ కుమార్



**ధర్మారం ఆగస్టు16 (ప్రజా జ్యోతి):**

పత్తిపాక గ్రామపంచాయతీ పరిపాలనలో ఉత్తమ సేవలు అందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వహించిన పత్తిపాక గ్రామ పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్ కుమార్ గౌడ్ ఉత్తమ కార్యదర్శి అవార్డును అందుకున్నారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా తాళ్ల కిరణ్ కుమార్ గౌడ్ ఉత్తమ కార్యదర్శి అవార్డును అందుకున్నారు.గ్రామ అభివృద్ధి కార్యక్రమాల అమలు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, పంచాయతీ పరిపాలనలో సమర్థవంతమైన సేవలు అందించడంలో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించినట్లు తెలిపారు.అవార్డు అందుకున్న తాళ్ల కిరణ్ కుమార్ గౌడ్‌ను పత్తిపాక గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది అభినందించారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కిరణ్ కుమార్ గౌడ్ తెలిపారు.



# ధర్మారం ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఆపన్నహస్తం

**కోరుట్ల రూరల్, ఆగస్టు 16(ప్రజా జ్యోతి)**

కోరుట్ల మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో 20032004 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సేవాభావాన్ని చాటుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సౌకర్యార్థం 200 ప్లేట్లను పాఠశాలకు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్లేట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ దొడ రంజిత్ రెడ్డికి అందజేశారు. తాము విద్యనభ్యసించిన పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని గ్రామస్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.
పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.